





భూమి పూజ చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

చిమ్మచీకట్లో... మంచు దుప్పట్లో..!



తమిళనాడు రాష్ట్రం 200 కి.మీ దూరం నుంచి..
ఉపాధి కోసం వలస వచ్చిన కూలీలు
'బాల్యం' చెరకు నరికేచోటే 'అంకితం'
'బొమ్మరిల్లు' గుడారాల్లో 'భారత్‌' వెలిగిపోతోంది

ప్రజాశక్తి - పిచ్చాటూరు

అంతా ఏడాది నుంచి పదేళ్ల వయస్సున్న చిన్నారులు ఎనిమిది మంది.. అమ్మానాన్న తెలతెలవారుతుండగానే వంట చేసేసి చెరకు నరికేచోటకు మేస్త్రి తెచ్చిన వాహనాల్లో వెళ్లిపోతారు.. నిద్ర లేచినప్పటి నుంచి మళ్లీపడుకునే వరకూ పిల్లలిష్టం. ఆడుకుంటారు.. కొట్టుకుంటారు.. ఎగురుతారు.. గెంతుతారు.. మండుటెండలో బొమ్మరిల్లు లాంటి గుడారాల్లో తలదాచుకుంటారు.. రాత్రి వేళ చిమ్మచీకట్లో మంచు దుప్పట్లో ఒళ్లు కప్పకుంటారు.. వీరిలో ఐదుగురు బడిఈడు పిల్లలు కావడం గమనార్హం. వీరంతా చెరకు నరికే కూలీల పిల్లలు.

మొత్తం పిల్ల జెల్లా అంతా కలిపి 25 మంది. తమిళనాడు రాష్ట్రం దిండవనం జిల్లా నుంచి 25 మంది కూలీలు 200 కిలోమీటర్ల దూరం నుంచి ఉపాధి కోసం తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలానికి వలస వచ్చారు. భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, వెలిగిపోతుందని గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రాల మధ్య వలస బతుకులివి. శనివారం తెల్లవారుజామున 'ప్రజాశక్తి' కెమెరాకు మంచు దుప్పట్లో చిన్నారులు నిద్ర పోతూ కనిపించిన ఫొటోలు చిక్కాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒకప్పుడు చెరకు పెద్దఎత్తున సాగయ్యేది. రాష్ట్ర ప్రభుత్వాల పుణ్యమా అని జిల్లాలో రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలు, మూడు ప్రైవేట్ ఫ్యాక్టరీలు మూతబడ్డాయి. ఎన్నికల హామీల్లో భాగంగా ఆయా పార్టీలు సహకార చెరకు ఫ్యాక్టరీలను తెరిపిస్తామని డప్పాలు పలికినవారే. జిల్లాలో చెరకు ఫ్యాక్టరీలు లేకపోవడంతో తమిళనాడు నుంచే ఎక్కువగా దళారులు వచ్చి రైతులను బేరం కుదుర్చుకుని అక్కడి ఫ్యాక్టరీలకు చెరకు తోలుతుంటారు. చెరకు నరికే కూలీలు సైతం తమిళనాడు నుంచే వస్తుంటారు. ప్రతి ఏటా సీజన్‌ డిసెంబర్‌ చివరి నుంచి మొదలై మార్చి నెల వరకూ కొనసాగుతుంది. దాదాపు నాలుగు నెలల పాటు పొలాల్లోనే చిన్న చిన్న గుడ్డలతో గుడారాలు వేసుకుని, విద్యుత్‌ సౌకర్యం లేకుండా ఆరు బయట పొలాల్లోనే నిద్రిస్తారు. పగలంతా పెద్దలు చెరకు నరికే పనులకు వెళతారు. రాత్రంతా గుడారాల పక్కనే పంట పొలాల్లోనే పడుకుంటారు. వీరిని పనులకు తీసుకొచ్చిన మేస్త్రిలు కనీస సౌకర్యాలు సైతం కల్పించకపోవడం గమనార్హం.

అపాచీ... తూచ్‌!

-శంకుస్థాపనకే పరిమితం
-నిరుద్యోగులకు మిగిలింది నిరాశే

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

శ్రీకాళహస్తి ప్రాంతంలో 'అపాచీ' ఆశ కల్పించారు. ప్రత్యక్షంగా మూడు వేల మందికి, పరోక్షంగా ఐదు వేల మందికి సొంతూళ్లోనే ఉపాధి కల్పిస్తామని ఆశ చూపారు. రైతుల నుంచి 275 ఎకరాల డికెటి భూములను తీసుకున్నారు. అయితే, పరిశ్రమ ఏర్పాటు కాలేదు. దీంతో, ఈ ప్రాంత నిరుద్యోగులకు, కంపెనీకి భూములిచ్చిన రైతులకు నిరాశే మిగిలింది.

శ్రీకాళహస్తి రూరల్‌ మండలం ఇనగలూరు, గోవిందరావుపల్లి, పోలి, భీమవరం పంచాయతీల పరిధిలో 16 గ్రామాలు ఉన్నాయి. డిగ్రీ, ఐటిఐ, ఇంటర్‌ చదివిన విద్యార్థులు వెయ్యిమందిపైనే ఉన్నారు. చదువుకున్నా ఉద్యోగం రాక ఉపాధి పనులకు వెళ్తున్నారు. మరికొంతమంది పక్కనున్న శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, సూళ్లూరుపేట, రేణిగుంట ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో రోజు కూలీలుగా పని చేస్తున్నారు. కొందరు ఉపాధి కోసం వలస వెళ్లారు. రైతులు సాగు చేసుకుంటున్న డికెటి భూముల్లో పరిశ్రమ ఏర్పాటుకు అపాచీ కంపెనీ ముందుకొచ్చింది. చెప్పులు, బూట్లు, బెల్ట్‌లు, పర్సులు, బ్యాగ్‌లు, కార్ల కవర్లు వంటివి తయారు చేయనున్నట్లు తెలిపింది. పరిశ్రమ కోసం భూములిస్తే ఎకరాకు రూ.5 లక్షలు ఇస్తామని రైతులకు ప్రభుత్వ అధికారులు మొదట్లో చెప్పారు. రైతులు నిరాకరించడంతో 'స్థానిక' అధికార ప్రజాప్రతినిధి వద్ద మధ్యవర్తిత్వంతో ఎకరాకు రూ.17.50 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఈ పరిశ్రమలో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. దీంతో, ఇనగలూరు రైతులు 70 మంది, గోవిందరావుపల్లి రైతులు 70 మంది, పోలి, భీమవరం రైతులు 17 మంది తమ డికెటి భూములను ఇచ్చారు. అయితే, తమకు రూ.14.50 లక్షలు చొప్పున మాత్రమే ముట్టాయని, మధ్యవర్తిత్వం వహించిన ప్రజాప్రతినిధి ఎకరాకు మూడు లక్ష రూపాయల చొప్పున కమీషన్‌ తీసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అపాచీ పరిశ్రమకు 2022 జూన్‌ 23న ముఖ్యమంత్రి


అపాచీ కోసం సేకరించిన భూములు

జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. పది రోజుల్లో నిర్మాణ పనులు చేపడతామని, ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభిస్తామని ఈ సందర్భంగా అపాచీ ప్రకటించింది. అయితే, నేటికీ పనులు ప్రారంభించలేదు. పైగా, ఏర్పాటు చేసిన బోర్డును, పునాది రాయిని సైతం తొలగించింది. అపాచీ కంపెనీకి గూడూరు, తడలో బ్రాంచులు ఉన్నాయి.

చిన్న పిల్లలను వదిలి దూరంగా ఉంటున్నాను



వెంకటగిరి ప్రభుత్వ కాలేజీలో ఐటిఐ చదివాను. ఫిట్టర్‌ పాసయి నాలుగేళ్లయింది. నా కోర్సుకు సంబంధించి ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. డ్రైవింగ్‌ నేర్చుకుని తిరుమలలో ఆప్టింగ్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. రోజుకు రూ.1,200 వస్తోంది. వసతి, భోజనం పోను రోజుకు రూ.700 మిగులుతోంది. నాకు అమ్మ, నాన్న, భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. నెలకోసారి ఇంటికి వచ్చి వారిని చూసుకుంటున్నాను. అపాచీ పరిశ్రమ వచ్చి ఉంటే ఇక్కడే ఉద్యోగం లభించేది.

-రాఘవ, ఇనగలూరు

పెయింటింగ్‌ పనులకు వెళ్తున్నాను



డిగ్రీ పూర్తయి ఆరేళ్లయింది. ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. అపాచీ పరిశ్రమ వస్తుందని ఆశపడ్డాను. స్థానికంగా ఉద్యోగం చేసుకోవచ్చని అనుకున్నాను. పరిశ్రమ రాలేదు. ఉద్యోగం రాక వెంకటగిరిలో పెయింటింగ్‌ పనికి వెళ్తున్నాను.

-లోకేష్‌, గోవిందరావుపల్లి

బర్డ్‌ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరురపతి సిటి ముంబాయికి చెందిన కమల్‌ ఝుంఝున్వాలా, బాల సుదర్శన్‌ రెడ్డి శనివారం బర్డ్‌ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం ఇచ్చారు. తిరుపతి బర్డ్‌ ఆసుపత్రిలో శనివారం ఉదయం దాతలు ఈ విరాళం చెక్కును బర్డ్‌ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్‌ రెడప్పరెడ్డికి అందచేశారు.

ఉరికొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్‌ ఉద్యమ స్ఫూర్తితో.....

మతోన్మాద బిజెపిని ఓడించండి!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్‌, యంత్రాంగం

భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్‌ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్‌ ఉద్యమ స్ఫూర్తితో మతోన్మాద బిజెపిని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్‌ 92వ వర్ధంతి పురస్కరించుకుని చింతలచేను సమీపంలోని రైల్వేగేటు వద్ద ఉన్న భగత్‌సింగ్‌,సుఖదేవ్‌, రాజ్‌గురు విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. మతోన్మాద బిజెపి విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్‌ స్ఫూర్తితో పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. భగత్‌సింగ్‌ బ్రిటీష్‌ సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవడమే కాకుండా, ఆనాటి యువతకు చెరగని ముద్ర వేశారన్నారు. యావత్‌ ప్రపంచం భగత్‌సింగ్‌ స్ఫూర్తిని కొనియాడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు


తిరుపతిలో...

టి.సుబ్రమణ్యం, ఎస్‌.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, కె.వేణుగోపాల్‌, పి.బుజ్జి, ఆర్‌.లక్ష్మి, పి.హేమలత, సెల్వరాజ్‌, ఒవి రమణ పాల్గొన్నారు. ఎంజిఎం పాఠశాలలో డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జయచంద్ర, సురేష్‌, చరణ్‌, భాస్కర్‌లు భగత్‌సింగ్‌ విగ్రహానికి పూలమాల వేసి పార్లమెంట్‌లో భగత్‌సింగ్‌ విగ్రహం ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. తిరుపతి బాలోత్సవం నాయకులు మల్లారపు నాగార్జున, ఆకుల మల్లేశ్వరరావు, సుంకర రెడ్డెప్ప, పయ్యావుల గురునాథం, మునిలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. రేణిగుంట బాలుర, బాలికల పాఠశాలలో ఒ.వెంకటరమణ ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయకమైన భగత్‌సింగ్‌ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. జెవివి నాయకులు కుప్పస్వామి పాల్గొన్నారు. పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో ఎస్‌వి ఐటిఐలో నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రకాశం పార్కు, ఎస్వీ యూనివర్సిటీ, పాలిటెక్నిక్‌ కళాశాలల్లో నిర్వహించారు. రాష్ట్ర నాయకులు వినోద్‌, జిల్లా కార్యదర్శి భగత్‌ రవి నాయకత్వం వహించారు.

సత్యవేడులో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో అమరవీరులకు నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ జి. ఉమాదేవి మాట్లాడుతూ భగత్‌సింగ్‌ ఉరికంభం ఎక్కి కోట్లాదిమంది భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. నాయకులు ఎం.రమేష్‌ పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో సిపిఎం కార్యాలయంలో చిత్రపటాలకు సిపిఎం శాఖ కార్యదర్శి జోగి శివకుమార్‌ నేతృత్వంలోనివాళి అర్పించారు. వెంకట రామిరెడ్డి, పుట్టా శంకరయ్య, సురేష్‌, పామంజి మణి పాల్గొన్నారు. నాయుడుపేటలో శివకవి ముకుంద ఆధ్వర్యంలో జరిగింది.



నాయుడుపేటలో..


సత్యవేడులో..

ప్రశాంతంగా ఫిజికల్‌ సైన్స్‌ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి

పదో తరగతి పరీక్షల్లో ఐదో రోజైన శనివారం ఫిజికల్‌ సైన్స్‌ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. తిరుపతి జిల్లాలో పరీక్షకు మొత్తం 27,388 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 26,826 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 562 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్‌ పేర్కొన్నారు. 97.94 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, పర్యవేక్షించినట్లు తెలిపారు.

పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారును టిప్పర్‌ ఢీకొంది. తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరు కావడానికి విజయవాడ వెళ్తున్న పులివర్తి నాని కారును గుంటూరు వద్ద టిప్పర్‌ ఢీకొంది. ఈ ప్రమాదంలో పులివర్తి నాని తో పాటు కారులో ఉన్న అందరూ సురక్షితంగా బయటపడ్డారు. కార్యకర్తలు, నాయకులు ఎవ్వరూ అధైర్యపడవద్దని క్షేమంగా ఉన్నానని ఆయన చెప్పారు.

పవన్‌ భరోసాతో సర్దుకున్న కోట వినుత

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ పిలుపు మేరకు మంగళగిరి కేంద్ర కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోటా దంపతులు కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే సీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపవన్‌ కల్యాణ్‌ ఎంఎల్‌ఎ కంటే బలమైన ప్రాతినిధ్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ఆమె కృతజ్ఞతలు తెలిపారు. టిడిపితో కలిసి పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. రాష్ట్రం కోసం, పవన్‌ కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని తెలిపారు. మార్పు సాధించడానికి రాష్ట్రవ్యాప్తంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.






ఈవోగారు...సపరేటా...!

టిటిడికి వర్తించని ఎన్నికల నిబంధనలు


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'టిటిడి ఇన్‌ఛార్జి ఈవో ఎవి ధర్మారెడ్డి డిప్యూటేషన్‌ గడువు మే 14తో ముగియనుంది. ఎన్నికల కోడ్‌ అమల్లో ఉన్నందున ఆ సమయంలో వేరే వారిని భర్తీ చేయడం తగదు.. ఈ నేపథ్యంలో ముందుగానే టిటిడిలో రెగ్యులర్‌ ఈవోను నియమించి ఉండొచ్చని' రాయలసీమ పోరాట సమితి కన్వీనర్‌ నవీన్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. టిటిడిలో రెగ్యులర్‌ ఈవోగా పనిచేసేందుకు నిజాయితీ, అర్హత కలిగిన ఐఎఎస్‌ అధికారులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈవో ఎవి ధర్మారెడ్డి డిప్యూటేషన్‌ కాలపరిమితి సూపర్‌ఏన్యుయేషన్‌ జూన్‌ 30 వరకూ ఇవ్వాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌కు లేఖ రాయడంలో ఆంతర్యం ఏంటని మండిపడ్డారు. మార్చి, ఏప్రిల్‌, మే, జూన్‌ మాసాల్లో వేసవి సెలవులతో పాటు అన్ని పరీక్షలు పూర్తయినందున తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దాదాపు 30 గంటల పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో దర్శనం కోసం వేచి ఉంటారని, ఈ కారణంగా ధర్మారెడ్డి లాంటి అనుభవం కలిగిన అధికారి డిప్యుటేషన్‌ పిరియడ్‌ మే 14తో ముగియనుందని, మరో ఆరు వారాలు గడువు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంలో మర్మమేమిటో భక్తులకు సమాధానం చెప్పాలన్నారు. ఏళ్ల తరబడి ఇతర ఐఎఎస్‌లకు అవకాశం ఇవ్వకుండా ఎవి ధర్మారెడ్డినే కొనసాగించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. శ్రీవారికి సంబంధించిన బ్యాంకు డిపాజిట్లు, ఆర్థిక లావాదేవీలు సక్రమంగా జరుగుతున్నాయా? అనే అనుమానాలు కలుగుతున్నాయని, రెగ్యులర్‌ ఐఎఎస్‌ను నియమించి శ్రీవారి భక్తుల్లో అపోహను తొలగించాలన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌, ఎస్‌పి, ఇతర రెవెన్యూ ప్రభుత్వాధికారులను ఎన్నికల కోడ్‌ కారణంగా బదిలీ చేశారని, ఈవోకు మినహాయింపు ఏంటని ప్రశ్నించారు.



'శ్రామిక' పక్షపాతి సురేంద్రరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటి



తిరుపతి రైల్వే క్యారేజీ రిపేర్‌ షాప్‌ ఉద్యోగుల, కార్మికుల సమస్యల సాధన కోసం మూడు దశాబ్దాలుగా నిరంతరం పోరాటాలు సాగిస్తున్న అలుపెరగని శ్రామికుడు, కార్మిక నాయకుడు, దక్షిణ భారతదేశంలోనే రైల్వే మజ్దూర్‌ యూనియన్‌లో తనకంటూ ఒక ప్రత్యేక నాయకత్వాన్ని చాటుకున్న వ్యక్తి మోడీగుంట సురేంద్ర రెడ్డి. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పింఛన్‌ విధానాన్ని రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని అమలులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఆల్‌ ఇండియా రైల్వే మెన్‌ ఫెడరేషన్‌, సౌత్‌ సెంట్రల్‌ రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ జనరల్‌ సెక్రటరీ సిహెచ్‌ శంకర్రావు నాయకత్వాన్ని స్ఫూర్తిగా ఎంచుకుని సిఆర్‌ఎస్‌ మజ్దూర్‌ యూనియన్‌ బ్రాంచ్‌ తరపున అనేక పోరాటాలు నడిపించానని తెలిపారు. నూతన పింఛను విధానం వల్ల కార్మిక సోదరులకు భవిష్యత్తులో వచ్చే నష్టాన్ని కళ్ళకు కట్టినట్టు ఎగ్జిబిషన్‌ ద్వారా వివరించానన్నారు. తిరుపతి రైల్వే క్యారేజ్‌ రిపేర్‌ షాప్‌లో ఉద్యోగులు కార్మికుల పక్షాన 38 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో సమ్మెలు, ధర్నాలు, గేట్‌ మీటింగ్లు నిర్వహించి ఓటమి ఎరుగని నాయకుడుగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిల పరచుకొని, అందరి మన్ననలను పొందడం ఆనందంగా ఉందన్నారు.

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వెంకటాపురంలో మోడీగుంట దొరస్వామి రెడ్డి, నారాయణమ్మలకు ఐదో సంతానంగా సురేంద్ర రెడ్డి మే 10, 1964లో జన్మించారు. ప్రాథమిక విద్య పోలవరంలో, పదో తరగతి వరకూ పూతలపట్టులో, ఇంటర్‌ పాకాలలో, డిగ్రీ చిత్తూరు పివికెఎన్‌లో పూర్తి చేశారు. అన్నామలై యూనివర్సిటీలో బిఇడి చేసిన ఆయన సాంకేతిక విద్యవైపు దృష్టి సారించారు. తిరుపతిలో ఐటిఐ చేసి సెంటర్‌ ట్రైనింగ్‌ ఇన్స్టిట్యూట్లో అధ్యాపక వత్తిని నిర్వహించారు. 1987లో తిరుపతి రైల్వే క్యారేజీ రిపేర్‌ షాప్‌లో రైల్వే ఉద్యోగంలో చేరారు. 1991 సంవత్సరంలో తిరుపతికి చెందిన మంజులతో వివాహమైంది. వారికి హిమబిందు, సింధు ఇద్దరు కుమార్తెలు. ఆల్‌ ఇండియా రైల్వే మెన్‌ ఫెడరేషన్‌లో 2019నుంచి 2024 వరకు జోనల్‌ సెక్రటరీగా , వర్క్‌ షాప్స్‌ డివిజనల్‌ సెక్రెటరీగా తన 38 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. ప్రతి ఏటా స్పోర్ట్స్‌మీట్‌ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



సతీ సమేతంగా..

టిటిడి ఉద్యోగులు @ చింతలపాలెం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగుల సుదీర్ఘ పోరాట ఫలితంగా 5,500 మంది ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఏర్పేడు - వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన చింతలపాలెం వద్ద ఇళ్లస్థలాలను కేటాయించారు. దాదాపు 3 కిలోమీటర్ల దూరం పొడవున రోడ్డు పక్కన స్థలాలను ఇచ్చేందుకు టిటిడి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన చెట్టు పుట్ట జేసీబీలతో తొలగిస్తూ చదును చేస్తోంది. ఎన్నికల కోడ్‌ రాకముందే 5,500 మందికి స్థలాలను కేటాయిస్తూ ప్రొసీడింగ్స్‌ ఇచ్చారు. ఎకరా 25 లక్షల చొప్పున 225 మంది రైతులకు రూ.87 కోట్లు నష్టపరిహారం చెల్లించారు. ఇంకా 27 మంది రైతులకు ఇవ్వాల్సి ఉంది. చెట్టు పుట్ట చదును చేసిన వెంటనే, సర్వే నిర్వహించి, ప్లాట్లు వేసి డిప్‌ ద్వారా వీరికి కేటాయించనున్నారు. రెగ్యులర్‌ ఉద్యోగులకు 2,223 మందికి, రిటైర్‌ అయిన వారికి 3,277 మందికి 50 అంకణాల చొప్పున ఇవ్వనున్నారు. ఈ స్థలం అభివృద్ధికి, రిజిస్ట్రేషన్‌కు కొంతమేర లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంది. తొలివిడతగా టిటిడి పర్మినెంట్‌ ఉద్యోగులకు వడమాలపేట మండలం పాదిరేడు వద్ద 5,192 మందికి ఇళ్లస్థలాలను ఇచ్చారు. రెండు, మూడో విడతలుగా చింతలపాలెం వద్ద కేటాయించారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు టిటిడి ఉద్యోగులు పోరాడిన ఫలితం ఇది.

- ఇక్కడే 5,500 మందికి ఇంటి స్థలాలు
- రైతులకు రూ.87 కోట్లు చెల్లింపు



'కోడ్‌' కొరఢా...!

స్వామిభక్తికి ...స్వస్తి చెప్పాల్సిందే..!


ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజాదృష్టి

ఎన్నికల కోడ్‌ అమల్లోకి వచ్చింది...అధికారులు, ఉద్యోగులు అధికార పక్షానికి అండగా ఉంటే అంతేసంగతులు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా చర్యలు తప్పవు. ఇప్పటికే జిల్లాలో కోడ్‌ ఉల్లంఘన చర్యలు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల వాలంటీర్లు పట్టుబడుతున్నారు. గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్‌ ఈ సారి పకడ్బంది చర్యలు చేపట్టడం గమనార్హం. 'సి విజిల్‌ యాప్‌' సైతం అందుబాటులోకి వచ్చింది.

అధికారంలో ఉన్న వాళ్ల పట్ల స్వామిభక్తి చూపిస్తే ఉద్యోగులకు పదోన్నతులు, అనుకున్న చోటికి బదిలీలు, ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ చేయెచ్చు అని కొంతమంది అధికారులు, ఉద్యోగులు అధికార పక్షానికి తొత్తులుగా వ్యవహరించడం పరిపాటే. ఇదంతా సాధారణ రోజుల్లో.. ఎన్నికల సమయాల్లో స్వామిభక్తికి స్వస్తి చెప్పాల్సిందే. కాదు కూడదనుకుంటే కొరఢా ఝులిపిస్తుంది. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో అనేక మంది అధికారులు, ఉద్యోగులు అధికార పక్షానికి తొత్తులుగా వ్యవహరిస్తూ, వారికి అనుకూలంగా నిర్ణయాలు చేసిన ఘటనలు అనేకం. రెవెన్యూ విభాగం మరో అడుగు ముందుకేసి అధికార పార్టీ భూకబ్జాలకు, ఇసుక దోపిడికి, మైనింగ్‌ మాఫియాగా సహకరించారన్నదీ బహిరంగ రహస్యమే. వామపక్షాలు, ప్రతిపక్షాలు ఎన్ని ఉద్యమాలు, నిరసనలు, నిరహారదీక్షలు చేసిన చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లే అనే రీతిలో వ్యవహరిస్తూ, అధికార పార్టీ అండతో పెట్రేగిపోయారు. మున్సిపల్‌, కార్పొరేషన్‌, స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉపాధ్యాయ, పట్టాభద్ర ఎంఎల్‌సి ఎన్నికల్లో నకిలీ ఓట్లు నమోదు, దొంగోట్లు పోలింగ్‌కు సహకరించి, అధికార పార్టీ ఆధిక్యానికి తోడ్పాటు అందించారు. ఈ వ్యవహారాలపై ఈసికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కొంత మంది అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంది. అయితే ఆయా ప్రజాప్రతినిధులు మాత్రం వారికి అండగా ఉండలేకపోయారు. అవసరానికి వాడుకుని, వారిని బలి పశువులు చేశారన్నది సత్యం. ఇన్ని జరుగుతున్నా కొంతమందిలో మార్పే లేదు.

ఈ నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. 16వ తేది సాయంత్రం 4 గంటల నుంచి దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవ్వరు పార్టీల కార్యక్రమాలకు, ప్రజాప్రతినిధుల సమావేశాలు, సభలు, సదస్సులకు హాజరుకాకూడదన్నది నిబంధన. కానీ దాన్ని అతిక్రమించి పడమట మండలాల్లో ఓ ఏఎన్‌ఎం విధి నిర్వహణలో ఉంటూ ఓ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని, నృత్యం చేయడం, తిరుపతి దిశ పోలీసు స్టేషన్‌లో పని చేసే ఓ హెడ్‌కానిస్టేబుల్‌ బాకరాపేట సమీపంలోని ఓ గ్రామంలో ఓ పార్టీకి కండువ వేసుకుని, ఇంటింటికి వెళ్లి, కరపత్రాలు పంచడం వంటి ఘటనలు బహిర్గతం కావడంతో జిల్లా కలెక్టరు వెనువెంటనే వారిపై విచారణ జరిపి గంటల వ్యవధిలోనే వారిని సస్పెండ్‌ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పదుల సంఖ్యలో వాలంటీర్లను సైతం పార్టీల ప్రచారాల్లో పాల్గొంటున్నారని విధుల నుంచి తొలగించారు. ఇవి బహిర్గతమైనవి మాత్రమే లోలోపల రహస్య ప్రచారాలు చేస్తున్న వారి పరిస్థితి ఏంటి, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల సంఘం పకడ్బంది చర్యలు చేపట్టింది. ఏదిఏమైనా సార్వత్రిక ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగితేనే ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది.



కలెక్టరేట్‌ సాక్షిగా కోడ్‌ ఉల్లంఘన

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి -రామచంద్రాపురం(పాకాల): నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పాకాల మండలంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో రీపోల్ జరిగిన పోలింగ్ కేంద్రం పులివర్తి వారిపల్లి పోలింగ్ కేంద్ర గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి పోలింగ్ కేంద్రమైన ఎంపీపీ పాఠశాలను పరిశీలించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని ఓటు వేయడం మన హక్కు అని, ఓటు హక్కును తప్పక వినియోగించుకోండి అని సూచించారు. తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా,రీ పోల్ కు తావు లేకుండా కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్ ఏర్పాటు, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లతో, పర్యవేక్షణ చేపడుతామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పిఎస్ సంఖ్య వివరాలను, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ర్యాంపు, తాగు నీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం కే. ఒడ్డేపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ తిరుపతి నిశాంత్ రెడ్డి, తహశీల్దారు వాణిశ్రీ, బిఎల్ఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

96 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -దొరవారిసత్రం: 96 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. దొరవారిసత్రం మండల పరిధిలోని కలకత్తా చెన్నై జాతీయ రహదారి సమీపం ఉన్న కలగుంట ఫ్లైఓవర్ ప్రాంతంలో ఏపీ 39 వి సి 15 84 నెంబర్ గల వాహనంలో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్నారు. వెంటనే స్పందించి సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు దాడి చేసి నాలుగు వేల కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీన పరచుకున్నారు. తరలిస్తున్న వాహనాన్ని, డ్రైవర్ షేక్ సద్దాం హుస్సేన్ పోలీస్ స్టేషనుకు తరలించి కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యాన్ని సూళ్లూరుపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై అధికారులు ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల వర్క్ షాప్‌లో ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఎన్నికల్లో అనసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల ప్రచారం, ప్రభుత్వం వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం, సామజిక మధ్యమాల ద్వారా ప్రభుత్వం వైఫల్యాలలను ఎండగట్టడం, టిడిపి మేనిఫెస్టోని ప్రజలకు చేరువ చేయడం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పిస్తూ అభ్యర్థులకు శనివారం వర్క్‌షాపు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆ పార్టీ తిరుపతి జిల్లా నాయకులకు శనివారం దిశా నిర్దేశం చేశారు. ఈ వర్క్ షాప్‌లో సత్యవేడు నియోజకవర్గం టిడిపి ఉమ్మడి అభ్యర్థి ఆదిమూలం పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరులో శనివారం సాయంత్రం సిఆర్పిఎఫ్ డిఎస్పి జితేందర్ సింగ్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 50 మంది కేంద్ర బలగాలతో శనివారం సాయంత్రం పిచ్చాటూరు మండలంలోని కారూరు, అడవికొడియంబేడు, ఎస్ఎస్‌బి పేట గ్రామాల్లో కవాతు నిర్వహించామన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డిఎస్పీ తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కవాతులు నిర్వహిస్తున్నామన్నారు.

చేపల చెరువుల వేలం

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి పురపాలక సంఘానికి చెందిన చేపల చెరువులను 2024-25 సంవత్సరానికి సంబంధించిన వేలం పాటలు 22, 24వ తేదీల్లో ఉదయం 11 గంటలకు వెంకటగిరి పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కానీ ఆ వేలం పాటకులకు ఎవరూ హాజరు కానందువల్ల ఈ నెల 28వ తేదీ 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అమ్మవారిపేట చెరువు, చెవిరెడ్డిపల్లి చెరువు, పెరివరం చెరువు, మలాల్పేట చెరువు, కుమ్మరి గుంట చెరువు, ధర్మపురం చెరువు, పోలిశెట్టి గుంట చెరువులను ఈ వేలం పాటలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీసిటీలోని వైద్య సదుపాయాలపై అవగాహన

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: శ్రీసిటీలోని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల పట్ల అవగాహనా సదస్సు శుక్రవారం స్థానిక క్రీక్ సైడ్ అపార్ట్‌మెంటు ఆవరణలో నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాని శ్రీసిటీలోని రామచంద్ర, మెడికవర్, కేర్ డెంటల్, శంకర్ నేత్రాలయ, తులసి ఆయుర్వేదిక్ ఆసుపత్రుల డాక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ ఆసుపత్రుల్లో అందుబాటులో వున్న వైద్య సదుపాయాల గురించి డాక్టర్లు వివరించారు. తమ వైద్యశాలల్లో గత ఏడేండ్లుగా అధునాతన దంత చికిత్సలందిస్తున్నామని కేర్ డెంటల్ డాక్టర్ మెటిల్డా పేర్కొన్నారు. డెంటల్ ఎక్స్ రే వసతితో పాటు నగరాలకు దీటుగా అన్ని రకాల చికిత్సలు తాము చేస్తున్నామని చెప్పారు. రామచంద్ర డాక్టర్ సులోచన మాట్లాడుతూ, తమ హాస్పిటల్ లో 24/7 వైద్య సేవలతో పాటు అంబులెన్సు సదుపాయం, వారంలో రెండు రోజులు స్పెషాలిటీ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ వైద్యశాలల ప్రత్యేకతల గురించి డాక్టర్ ధీరజ్ రెడ్డి (మెడికవర్), డాక్టర్ మోహన్ కౌర్ గిల్ (శంకర్ నేత్రాలయ), డాక్టర్ సాయి ప్రియ (తులసి ఆయుర్వేదిక్) వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ శ్రీసిటీ చేపడుతున్న వివిధ ఆరోగ్య సంరక్షణ చర్యలను వివరించారు. తమ శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీలకు అనుమతి లేదు: తహశీల్దారు

ప్రజాశక్తి -చిట్టమూరు: ఎన్నికల కోడ్ కారణంగా చిట్టమూరు మండలంలో ఫ్లెక్సీలకు, ర్యాలీలకు అనుమతి లేదని తహశీల్దారు తహశీల్దారు శ్రీనివాస్ శర్మ పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జనరల్ ఎలక్షన్స్ దృష్ట్యా ఎన్నికల కోడ్ ఉందని, జిల్లా, రాష్ట్ర పొలిటికల్ నేతలు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రచారం, ర్యాలీ, ప్రచార రథం, బైకులు ఫ్లెక్సీ, బ్యానర్స్, ర్యాలీ, సమావేశాలు నిర్వహించకూడదని అనుమతి తప్పనిసరి అన్నారు. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందొస్తు అనుమతికి సువిధ యాప్ డౌన్ లోడ్ చేసుకొని ఆర్ఓ, గూడూరు ద్వారా అనుమతి పొందాలని, ఎన్నికల సంబంధించి నిఘా టీమ్ పర్యవేక్షణ ఉంటుందని అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమావళి పై చర్యలు ఉంటాయని తగు సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగరాజ ,ఎస్సై బి. బలరామయ్య డి.టి నిరంజన్ ఆర్.ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు టిడిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని నూతుగుంటపల్లి గ్రామంలో ఆదివారం మండల టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల ఆ పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కుప్పం బాదూరు గ్రామంలో వైసిపి యువనేత కిరణ్ కుమార్ రెడ్డి, ఆయన అనుచరులు చంద్రగిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో టిడిపిలో చేరనున్నారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నూతుగుంటపల్లి గ్రామంలో మండల టిడిపి కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. కార్యకర్తల సమావేశానికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, మహిళలు, అభిమానులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ బాధ్యతగా చేయాలి

ప్రజాశక్తి -బాలాయపల్లి: పౌష్టికాహారం అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యతగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గోట్టికాడు గ్రామంలోని అంగన్వాడీ కార్యాలయంలో పౌష్టికాహార వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం పంపిణీ బాధ్యతగా ఉండాలన్నారు. ఈ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు,బాలింతలకు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్హత ఉన్న వారికి అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ, మహి ళా రక్తహీనత కలిగిన వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్ర మంలో సూపర్ వైజర్ లు రాజేశ్వరి, లీల, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో 15 పతకాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రాష్ట్రస్థాయిలో ఇటీవల జరిగిన రెజ్లింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు 15 పతకాలను సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తిరుపతి జిల్లా ఒలంపిక్ రిజిస్ట్రేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఈనెల 20 21 తేదీలలో చిత్తూరు లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో



రాష్ట్ర స్థాయిలో బహుమతులు పొందిన రెజ్లింగ్ క్రీడాకారులు

దాదాపు 15 పతకాలు తిరుపతి జిల్లాకే రావడం గర్వకారణన్నారు. నిరంతరం శ్రమించే శిక్షకుడు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులందరూ ప్రతిరోజూ చక్కగా శిక్షణ పొందడం వల్లే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో ఇన్ని పతకాలు తిరుపతి జిల్లాకి వచ్చాయన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని క్రీడలలో ఉన్న క్రీడాకారులు ప్రతిరోజూశిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ పొందాలని అప్పుడే రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి క్రీడలలో రాణిస్తా రని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసి యేషన్ అధ్యక్షులు ఎన్ సురేష్, సహ కార్యదర్శి రవి రెడ్డి పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో వినూత్న నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్: వారం రోజులుగా గూడూరు పట్టణంలో నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని, ప్రజలు బిందెలు పట్టుకొని నీటి కోసం పరుగులు తీస్తున్నారని గూడూరు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి వెల్లడించారు. గూడూరు పట్టణం లోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మహిళలు, నాయకులు నిరసన ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి మాట్లాడుతూ గత వారం రోజులుగా పట్టణంలో నీరు సక్రమంగా రావడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక వార్డుల్లో కాలువల శుభ్రం చేయడం లేదని,



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

వీధిలైట్లు సంవత్సరాల తరబడి వెలగకపోయినా పట్టించుకోలేదని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రేపటిలోగా నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. ఈ నిరసనలో లీలావతి ,మట్టం శ్రావణి ,భారతి, సుబ్బమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- రీసెర్చ్ డీన్ ఆచార్య ఎస్ విజయభాస్కరరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు సమాజ సేవలో భాగంగా ప్రకృతిని పరిరక్షించే పౌరులుగా, కళాశాల పరిసరాలను పరిశుభ్రం ఉంచే కార్యక్ర మాలు, ఇతర సాంఘిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఎస్వీయూ రీసెర్చ్ డి ఆచార్య ఎస్ విజయభాస్కరరావు విద్యార్థులకు పిలుపు నిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యా లయంలోని సైన్స్ కళాశాల పరిధిలో భౌతిక శాస్త్రం విద్యార్థులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు 'వరకు పచ్చదనంమే పరిశుభ్రత' కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రతి నాలుగవ శనివారం పచ్చదనం, పరిశుధ్య పరిరక్షణ కార్యక్రమాలు చేశారు. ఇందులో



సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైన విద్యార్థులు, అధ్యాపకులు

భాగంగా శనివారం భౌతిక శాస్త్ర విద్యార్థుల ఆధ్వర్యంలో సైన్స్ కళాశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. తరగతి గది చుట్టూ కళాశాల ప్రాంతంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని విద్యార్థులు శుభ్రపరిచారు. విద్యార్థులు తరగతి గదిలోని జ్ఞానంతో పాటు ఇతర సాంఘిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటే పరిజ్ఞానం పెంపొందిం చుకోవ చ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశా ల ప్రిన్సిపల్ ఆచార్య కే తులసి, రామకృష్ణారెడ్డి , ఎపి ఆర్ సెట్ కన్వీనర్ ఆచార్య బి దేవప్రసాదరాజు, అకడ మిక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఆర్పి విజయలక్ష్మి , పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం చేపట్టాలి

- రైల్వే జీఎంకు బాధితురాలు వినతి
- స్పందించిన రైల్వే జీఎం, దర్యాప్తునకు ఆదేశం

ప్రజాశక్తి - రేణిగుంట: 'కారుణ్య నియామకం ద్వారా మా కుమారుడికి రైల్వే ఉద్యోగం ఇచ్చి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రైల్వే ఉద్యోగస్తుడు తడుకు రాజమణి భార్య తడుకు సుబ్బమ్మ, ఆమె కుమారుడు పురుషోత్తం రైల్వే జీఎం అరుణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. శనివారం తిరుపతి రైల్వే స్టేషన్ తనిఖీలు అనంతరం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. రైల్వే జీఎంను మర్యాద పూర్వకంగా కలుసుకున్న తడుకు సుబ్బమ్మ వినతిపత్రం అందించారు. తన భర్త రాజమణి రైల్వే ట్రాక్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందాడని జీఎంకు వివరించారు. తాము దళిత కుటుంబానికి చెందిన వారమని పేర్కొన్నారు. భర్త మరణానంతరం తమ కుటుంబం పీకల్లోతో ఆర్థిక ఇబందుల్లో కూరుకు పోయిందని కన్నీరు మున్నీరుగా విలపించారు. బాడుగ ఇంట్లో జీవనం సాగిస్తున్నామని తమ కుమారుడు కూలి పనికి వెళ్తే గాని తమ కుటుంబ పోషణ సాగదని



రైల్వే జీఎంకు వినతిపత్రం అందిస్తున్న బాధితుడు

తెలిపారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం రావలసి ఉండగా గత డిఆర్ఎం తిరస్కరించారని రైల్వే జిఎంకు వివరించారు. తమకు సొంత ఇల్లు, సొంత స్థలాలు, పొలాలు ఏమీ లేవని తమ కుమారుడు కూలి పనికి వెళితేనే పూట గడుస్తుందని రైల్వే జీఎం వద్ద గగ్గోలు పెట్టారు. సానుకూలంగా విన్న రైల్వే జీఎం అరుణ్ కుమార్ కచ్చితంగా న్యాయం చేస్తానని వినతి పత్రం సెక్రటరీకి అందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్ఎం వినీత్ సింగ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ ఛైర్మన్ అసన్ సాహెబ్, బ్రాంచ్ సెక్రటరీ జయంత్ కుమార్, సహాయ కార్యదర్శి రవీంద్రబాబు, శేషాద్రి, షరీఫ్ పాల్గొన్నారు.

పరిశోధన అంశాలపై పట్టు సాధించాలి :

ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి పద్మనాభం

ప్రజాశక్తి - క్యాంపస్: నూతన పరిశోధన కోర్సులలో విద్యార్థులు పరిశోధన అంశాలపై జ్ఞానం, అవగాహనతో పట్టు సాధించాలని ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి పద్మనాభం సూచించారు. నూతనంగా పరిశోధనలో చేరిన విద్యార్థులు తమ పరిశోధన అంశాలతో పాటు ఇతర పరిస్థితులపై అవగాహనతో పూర్తి స్థాయిలో నూతన విషయాలను శోధించేందుకు తమ సమయాన్ని పూర్తిగా కేటాయించాలని పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శ్యామోహన్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలోని 216 ఆర్థిక శాస్త్రం గ్యాలరీలో నూతన పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీ పై వారం రోజుల క్రితం చేపట్టిన శిక్షణ శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.పద్మనాభం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధన పట్ల ప్రత్యేకమైన ఆసక్తిని, అభిరుచిని పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులు సరికొత్త విషయాలు పరిశోధన అంశాలపై జిజ్ఞాసతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో పరిశోధనలలో వినియోగించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శ్యామ్ మోహన్ డేవిడ్ రాజు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు పరిశోధన అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకునేందుకు, పరిశోధనలు తమ చాతుర్యాన్ని ప్రదర్శించేందుకు ఈ శిక్షణ ఎంతోఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పరిశోధన అంశాలను ఎంచుకోవడంలో తమ సొంత ఆలోచన ధోరణి పెంపొందించుకోవాలని కోరారు. పరిశోధనలలో విద్యార్థులు నిరంతరం నూతన విషయాలను తెలుసుకోవడంలో ఆసక్తిని ప్రదర్శించాల న్నారు. శిక్షణ కార్యక్రమంలో వారం రోజులపాటు రిసోర్స్ పర్సన్ గా విచ్చేసి విద్యార్థులకు పరిశోధనా రంగంలో పరిపూర్ణ జ్ఞానాన్ని అందించిన శిక్షకులకు ప్రిన్సిపల్ ఆచార్య పద్మనాభం, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శ్యామోహన్ డేవిడ్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వియు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

ఆశ వర్కర్స్ యూనియన్ నాయకుల పిలుపు

ప్రజాశక్తి- వాకాడు: ఆశా వర్కర్లు తమ సమస్యల సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆశ వర్కర్ల సమావేశంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవిత , లక్ష్మి పిలుపు నిచ్చారు. ఆశావర్కర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవిత , లక్ష్మి, కోశాధికారి సుజాత , ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పని భారం



సమావేశంలో మాట్లాడుతున్న ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు

తగ్గించాలని డిమాండు చేశారు . అధిక జనాభా ను అనుసరించి ఆశా కార్యకర్తలని కొత్తగా నియమించాలని వారు కోరారు ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుండి ఆశ కార్యకర్తలపై మానసిక వేధింపులు అధిక మయ్యాయని వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం12 మందితో నూతన కమిటీని ఎన్ను కున్నారు. అధ్యక్షురాలుగా జ్యోతి, కార్యదర్శిగా సునంద, ఉపాధ్యక్షురాలుగా మనెమ్మ, సహాయ కార్యదర్శిగా కామాక్షి, కోశాధికారి శ్రావణి, తదితరులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు

శ్రీరామ కళాశాలలో 'ఆవిష్కార్-2024'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు 'ఆవిష్కార్-2024' పేరుతో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతీయ సదస్సుకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన ఈఈఈ, ఇసిఇ, సిఎస్ఇ, సివిల్, మెకానికల్, ఎంబీఏ విభాగాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ఐఐటి ఈఈఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పిఎస్ సాయికృష్ణ మాట్లాడుతూ సమాజంలో సాంకేతిక అభివృద్ధి, నైపుణ్యత, ఆవశ్యకతలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఐఓటి, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పవర్ సిస్టమ్స్, రోబోటిక్స్, సిగ్నల్, ఇమేజ్ ప్రాసెసింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ పై పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్‌లను కళాశాల యాజమాన్యం నిర్వహించింది. శ్రీరామ కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యతను పెంచుకోవడానికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల మేధో సంపత్తిని పెంపొందించ డానికి వివిధ కార్యక్రమాలను చేయడంలో ముందున్నామన్నారు. వీటి ద్వారా విద్యార్థులు వారి జీవిత లక్ష్యాలను చేరుకోవడం సులభమవుతుందన్నారు. పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్ లలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె జయచంద్ర బహుమతులు అందించారు. ఈ సదస్సులో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. త్రివిక్రమ్, కన్వీనర్ డాక్టర్ బి లలిత, కళాశాల వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆవిష్కార్ -2024లో పాల్గొన్న పలువురు వక్తలు

మామిడికి కవర్ కట్టు.. మంచి ధరలు పట్టు..

మండలం ఉద్యానశాఖ అధికారి శివకుమారి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రస్తుతం మామిడి పంట దిగుబడి తక్కువగా ఉన్నందున నాణ్యత మెరుగ్గా ఉంటేనే మంచి ఆదాయం లభిస్తుందని, మామిడి పండ్ల నాణ్యత, రక్షణ , మంచి దిగుబడి, మంచి ధరల కోసం ఫ్రూట్ కవర్స్ వాడటం వల్ల అధిక ధర పొందవచ్చని మండలం ఉద్యానశాఖ అధికారి శివకుమారి పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కవర్లు కట్టడం వల్ల కాయపై మంగు మచ్చలు, టెంక పురుగులు, పండు ఈగలు, మచ్చ తెగుళ్ళ, తదితర చీడపీడలను నియంత్రించి నాణ్యమైన పండ్ల దిగుబడిని పెంచడానికి తోడ్పడుతుందన్నారు. ఈ కవర్లను పిందె దశలో సుమారు కోడి గుడ్డు పరిమాణంలో వాడవచ్చని తెలిపారు. పిందెలను సంచిలో పెట్టి మూడు సెంటీ మీటర్లపై తొడిమకు సంచికి ఉండే తీగను గాలి ప్రవేశించకుండా కట్టాలని సూచించారు. 50 రోజుల తర్వాత కాయను కోసుకోవచ్చని తెలిపారు. మామిడికి కట్టే కవర్లు, చెక్క గుజ్జుతో పేపరు తయారుకావడంతో కాయ నాణ్యతను పెంచుతుందన్నారు. ఎలాంటి క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా కాపాడుతుందన్నారు. ఎలాంటి పురుగు మందుల వాడకం అవసరం లేదని, అధిక సూర్య రశ్మి, వడగండ్ల వాన నుండి, ఉష్ణోగ్రతల నుండి కాయను రక్షిస్తుందన్నారు. ఈదురు గాలులకు, అధిక వర్షాలకు కాయలు రాలిపోకుండా కాపాడుతుందని, తొడిమలు దృఢంగా తయారై కాయ పరిమాణాన్ని పెంచుతూ దాని సహజరంగును విస్తరించేలా చేస్తుందని పేర్కొన్నారు.

తక్కువ కాలంలో అధిక దిగుబడులు

తక్కువ కాలంలో కాయ పెరిగి అధిక దిగుబడులు వస్తాయని, ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేస్తుందని తెలిపారు. మార్కెట్లో ఇలాంటి కాయలకి అధిక ధర పలుకుతుందని, నాణ్యమైన మామిడికాయలను ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చని తెలిపారు. ఈ ఫ్రూట్ కవర్ల ధర మార్కెట్లో రెండు రూపాయల నుండి రెండున్నర రూపాయల వరకు ఉంటుందని, వీటిని సక్రమంగా వాడుకుంటే రెండు సార్లు ఉపయోగించవచ్చని తెలిపారు. మామిడిలో పూత దశ నుండి కాయ దశ వరకు అనేక రకాల క్రిమి కీటకాలు ఆశిస్తుంటాయని దీనివల్ల పంట దిగుబడి నాణ్యత దెబ్బతినే ప్రమాదం వుందన్నారు. దీన్ని గుర్తించి రైతులు మామిడికాయలకు రక్షణ కవచంగా కవర్లను కట్టి మంచి ధరలను పొందాలని వారు రైతులకు అవగాహన కల్పించారు.



కవర్లతో కప్పిన మామిడి కాయలు

క్రైం న్యూస్

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఓ యువతి అనుమానాస్పద రీతిలో కనపడకుండా వెళ్లిన ఘటన తిరుపతిలో శనివారం చోటు చేసుకుంది. యువత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్కావెంజర్స్ కాలనీలో 23 సంవత్సరాలు యువతి ఓ వ్యక్తిని ప్రేమించింది. రెండు రోజుల క్రితం ప్రేమించిన వ్యక్తి వద్దకు వెళ్లి తనను పెళ్లి చేసుకుంటావా?' లేదా అంటూ నిలదీసింది. ఆ యువకుడు తాలువాహం చేసుకోలేనని బదిలిచ్చాడు . శనివారం ఉదయం 10 , 11 గంటల మధ్య ఇంటిలో నుండి బయటకు వెళ్లిన యువతి తర్వాత రాలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తమ కూతురు ఎక్కడో కనిపించడంలేదని ప్రేమించిన వ్యక్తిని నిలదీశారు. తనకు తెలియదని సమాధానం చెప్పడంతో యువతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదుతో సీసీ పుటేజ్ ను పోలీసులు పరిశీలిస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తిరుపతి ఈస్ట్ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

రుయాలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రుయాఆస్పత్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రుయా ఆసుపత్రి అత్యవసర విభాగంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. మృతుడు వయసు 40 సంవత్సరాలు ఉంటుందని, అతని వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే వెస్ట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 9440796750 ఫోన్ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఎండా కాలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు చేపట్టాలి అని, ఉపాధి హామీ పథకం పనుల్లో ఎస్సీ ఎస్టీ కుటుంబాల కవరేజీ పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుండి సిఎస్ కేఎస్ జవహర్ రెడ్డి పలు జిల్లాల కలెక్టర్లతో ఎండాకాలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు, ఉపాధి హామీ పథకం కార్యక్రమం ద్వారా కూలీలకు ఉపాధి పని దినాలు కల్పించడం వంటి పలు అంశాలపై సమీక్షించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో తాగు నీటి ఎద్దడి నివారణకు కంటింజెంట్ ప్రణాళికలు సిద్ధం చేశామని, బోర్ల ఫ్లషింగ్ 203, డీపెనింగ్ కోసం 456 ప్రతిపాదనలు 72.31లక్షలకు పంపామన్నారు. ఉపాధి హామీ పథకం అమలు లక్ష్యాల మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జూన్ 31 వరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, బోర్లు ఫ్లషింగ్, రిపేర్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. 15 వ ఆర్థిక కమిషన్ ద్వారా నిధులు విడుదల అయిన వాటిని వినియోగించాలని సూచించారు.

కుక్కంబాకంలో కోడ్ ఉల్లంఘన!



కుక్కంబాకంలో ఓ ఇంటిపై కనిపిస్తున్న డిజిటల్ బోర్డు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామంలో కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. గ్రామంలో ఓ ఇంటిపై జగన్ డిజటల్ బోర్డు దర్శనమిస్తోంది. గ్రామంలోని అంగన్‌వాడీ భవనం గోడకు ముఖ్యమంత్రి జగన్ ఫొటో కూడా దర్శనమిస్తోంది. గ్రామంలో సచివాలయ సిబ్బంది నిత్యం తిరుగుతున్నా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోడ్ ఉల్లంఘనపై టిడిపి నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం: చెల్లదురై

ప్రజాశక్తి -సత్యవేడు: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి శిఖమణి చెల్లదురై పేర్కొన్నారు. మండలంలోని దాసుకుప్పంలో శనివారం నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మోహన్ రెడ్డి, సబీర్ భాయ్, సెల్వరాజ్ లకు కండువా కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెల్లదురై మాట్లాడుతూ షర్మిల సారథ్యంలో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ బలోపేతం అయిందన్నారు. ప్రజలందరూ మళ్లీ కాంగ్రెస్ పాలన కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సారి కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ గెలవడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం లోని ఏడు మండలాలకు చెందిన కాంగ్రెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ నిండ్ర మండలం మేళంబాకం పంచాయతీ లోని గ్రామాలలో 'బాబుష్యూరిటీ-భవిషత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పథకాలను వివరించారు. తమను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూక తోటి రాజేష్‌ను కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి- నారాయణ వనం: నారాయణ వనం మండల పరిధిలోని సర్పంచులు, వైసిపి సీనియర్ నాయకులు సత్యవేడు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నూక తోటి రాజేష్‌ని శనివారం ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు ఏవైనా వుంటే తమకు తెలిపితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడా రిగ్గింగ్‌కు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులందరూ ఐకమత్యంతో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఊరప్ప, సర్పంచ్ లు గుణశేఖర్, అయ్యప్ప, స్వర్ణ, రాజా పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వేడుకలలో భాగంగా మెగా బ్రదర్స్ సేవా సమితి, అఖిల భారత చిరంజీవి యువత సభ్యులు తీగల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో గూడూరు జనసేన కార్యాలయంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో పెద్ద సంఖ్యలో రామ్ చరణ్ అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. రామ్ చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 27 వ తేదీ వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ అభిమానులు పేటేటి చంద్రనీల్, ఓంకార్, భాస్కర్, సాయి కిరణ్, సూర్య, మోహన్, వసంత్, శివ, సాయి, తిరుపాల్, మెగాభిమానులు పాల్గొన్నారు.


అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వాహకులు అల్లం రమణయ్య చేతుల మీదుగా షేక్ యస్థానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని శ్యామ సుందరపురానికి చెందిన షేక్ యస్థాని భార్య షేక్ జరీనా కొంత కాలంగా అనారోగ్యంగా బాధపడుతుండడంతో శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య స్పందించి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'అరణియార్'లో జింక మృతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని ఆరణియార్ ప్రాజెక్టు నీళ్లలో ఓ జింక మృతి చెందింది. స్థానికులు సమాచారం అందించడంతో ఫారెస్టు అధికారులు శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని జింక మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జింక మృతదేహాన్ని ఫారెస్టు అధికారులు స్థానిక పోలీసులతో కలిసి తీసుకెళ్లారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక



వైసిపిలో చేరుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం కాయంపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కాయం బాబురెడ్డి మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి పార్టీ కండువాను కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమం అందుతోందని, నియోజక వర్గంలో ఐదేళ్ల పాలనలో స్థానిక మంత్రి ఆర్కే రోజా పక్షపాత ధోరణితో వ్యవహరించి టీడీపీ వారిని వేధించిన దాఖలాలు లేవన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోను అందరికీ అండగా నిలిచి సహకారం అందించారన్నారు. ఇవంతా మనసును కదిలించడంతో మంచి చేసేవారికి అండగా ఉండాలని పార్టీలో చేరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.